సాక్షి ప్రకాశం

బుధవారం । 14 । ఆగస్టు । 2024



ఉచిత వైద్యం.. పేదలకు దూరం

వైద్యాన్ని ప్రవేటుపరం చేసి దాన్ని పేదలకు దూరం చేయడమే చంద్రబాబు లక్ష్యమని వైఎస్సార్ సీపీ వైద్య విభాగం రాష్ట్ర అధ్యక్షుడు బత్తుల అశోక్ కుమార్‌రెడ్డి అన్నారు. - 8లో..



నాటుసారా తయారీదారులపై పీడీ యాక్ట్

జిల్లాలో నాటుసారా తయారీదారులపై పీడీ యాక్టు నమోదు చేస్తామని ఎస్పీ హెచ్చరించారు. - 8లో..

గరిష్టం/కనిష్టం
36/25

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. అక్కడక్కడా ఉరుములు మెరుపులతో జల్లులు పడవచ్చు.

టీచర్లకు సర్దుపోటు

ప్రభుత్వ పాఠశాలల్లో చేపట్టిన 'పని సర్దుబాటు' ఉపాధ్యాయులకు సర్దుపోటుగా మారింది. ఎన్నికల ముందు ఈ విధానాన్ని ఉపాధ్యాయులకు అనుకూలంగా చేపడుతామని హామీలిచ్చి ఇప్పుడు పైరవీకారులకు మేలు చేసే విధంగా వ్యవహరిస్తోంది. ఈ ప్రక్రియ అంతా లోపభూయిష్టంగా.. గందరగోళంగా మారిందని ఉపాధ్యాయులు మండిపడుతున్నారు. ప్రభుత్వం అనుసరిస్తున్న తీరును ఎండగడుతున్నారు. ఉపాధ్యాయ సంఘాల విజ్ఞప్తులకు విరుద్ధంగా అశాస్త్రీయంగా చేపడుతోందంటూ తీవ్రస్థాయిలో నిరసనలు వ్యక్తమవుతున్నాయి.

- ఆశాస్త్రీయంగా ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియ
- నాడు హామీ ఇచ్చి నేడు మోసం
- సీనియార్టీలపైనా ఆందోళనలు
- 53 జీఓ ప్రకారం అదనంగా ఉపాధ్యాయుల కేటాయింపు చేపట్టాలి
- పదోన్నతులపైనా కొనసాగుతున్న జాప్యం



ఒంగోలు, సాక్షి ప్రతినిధి:

పాఠశాలల్లో ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియపై ఉపాధ్యాయుల్లో తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తమవుతుండగా, ప్రభుత్వానికి మాత్రం తలబొప్పి కడుతోంది. ఎన్నికల సమయంలో ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరిస్తామని హామీలు గుప్పించింది. అధికారంలోకి వచ్చాక అందుకు భిన్నంగా వ్యవహరిస్తోందని, నేడు విద్యాశాఖ మంత్రిగా ఉన్న లోకేష్ నాడు ఇచ్చిన హామీలను ఎందుకు విస్మరిస్తున్నారని ఉపాధ్యాయ సంఘాలు నిలదీస్తున్నాయి. నాడు ఓట్ల కోసం హామీలు ఇచ్చి నేడు ఉపాధ్యాయులను ఇబ్బంది పెట్టడం ఏంటంటూ మండిపడుతున్నారు. స్థానికంగా మండల విద్యాశాఖ అధికారులు లేదా ఉప విద్యాశాఖ అధికారుల పరిధిలోనే తాత్కాలికంగా ఉపాధ్యాయుల సర్దుబాటు సహజం. కానీ అందుకు భిన్నంగా రాష్ట్ర వ్యాప్తంగా తామే ఒక ప్రక్రియను చేపడతామంటూ నిర్ణయం తీసుకోవడంతో సమస్య జటిలంగా మారింది. ఉన్నత పాఠశాలల్లో ఆంగ్లమాధ్యమంతో పాటు సమాంతరంగా తెలుగు మాధ్యమం కూడా ప్రవేశపెట్టాలనే ఉపాధ్యాయ సంఘాల విజ్ఞప్తిని ప్రభుత్వం ఖరారు చేస్తే చాలా వరకు ఉపాధ్యాయ పోస్టులు అవసరం అవుతాయి. కానీ అందుకు భిన్నంగా జీఓ నంబర్ 117 రద్దు చేయకపోవడం, జీఓ నంబర్ 53 ప్రకారం కొన్ని పాఠశాలలకు అదనంగా పోస్టులు కేటాయించే వెసులుబాటుపై నిర్ణయం ప్రకటించకుండానే ఉపాధ్యాయుల సర్దుబాటుపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంతో ఉపాధ్యాయ వర్గాలు ఉద్యమబాట మొదలుపెట్టాయి.

టీఐఎస్‌లో వివరాలు నమోదు:

టీచర్స్ ఇన్ఫర్మేషన్ సిస్టంలో ఉపాధ్యాయుల వివరాలను నమోదు చేశారు. అయితే ప్రతి పిల్లవాడికి అమ్మఒడి అంటూ కూటమి పక్షాలు మేనిఫెస్టోలో ప్రకటించడంతో చాలామంది తల్లులు తమ పిల్లలను ప్రైవేటు బాట పట్టించారు. తీరా చూస్తే ఇటు తల్లికి వందనం అమలు ప్రక్రియ ఉంటుందో ఉండదో తెలియక తల్లిదండ్రులు బాధపడుతుంటే తాజాగా ఉపాధ్యాయ వర్గాల్లోను ఈ వ్యవహారం తీవ్ర ఆందోళనకు కారణమైంది. గత ఏడాదితో పోలిస్తే జిల్లాలో వేల సంఖ్యలో విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలల బాట పట్టినట్లు తెలుస్తుంది. దీంతో విద్యార్థుల నిష్పత్తికి అనుగుణంగా ఉపాధ్యాయుల సంఖ్య కూడా గణనీయంగా తగ్గాల్సి వచ్చింది. ఫలితంగా జిల్లాలో దాదాపు వెయ్యి పోస్టులకుపైగా ఉపాధ్యాయులు మిగులుగా చూపిస్తున్నారు. అందులోను జిల్లాలో ఈ విధానాన్ని ఖరారు చేయడంలోను పారదర్శకత లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. విమర్శలు వెల్లువెత్తడంతో సర్దుబాటు ప్రక్రియను రాష్ట్ర వ్యాప్తంగా తాత్కాలికంగా విరమించడం తెలిసిందే. అయితే మంగళవారం రాత్రి వచ్చిన తాజా మార్గదర్శకాల ప్రకారం మిగులు ఉపాధ్యాయులుగా ఉన్న వారిలో సీనియర్ మరో పాఠశాలకు వెళ్లదలుచుకుంటే వారికి అవకాశం కల్పిస్తారు. లేకుంటే జూనియర్‌ను మిగులు ఉపాధ్యాయుడిగా గుర్తిస్తారు.

సీనియార్టీపైనా ఆందోళన

సీనియార్టీలపై తీసుకుంటున్న చర్యలపై ఉపాధ్యాయ సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. ఉపాధ్యాయులు విధుల్లో చేరిన తేదీ, కేడర్ ఆధారంగా సీనియర్, జూనియర్‌గా పరిగణించాల్సి ఉంది. అందుకు భిన్నంగా వయసు ఆధారంగా సీనియార్టీనికి లెక్కించడంపై మండిపడుతున్నాయి. తొలుత ఈ ప్రక్రియను ఈనెల 10వ తేదీ నాటికే పూర్తి చేయాలని మార్గదర్శకాలు ఇచ్చినా మళ్లీ 14వ తేదీకి పొడిగించారు. తాజాగా 17వ తేదీ లోగా జాబితా ఖరారు చేయాలని నిర్ణయించారు. ఈ నేపథ్యంలో ఉపాధ్యాయ సంఘాల ఆగ్రహాన్ని గమనించిన ప్రభుత్వం దిగి రావడం, ఉపాధ్యాయ సంఘాలతో పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ సమావేశం నిర్వహించాలని నిర్ణయించడంతో మరికొంత జాప్యం జరిగే అవకాశం కనిపిస్తోంది.

సబ్జెక్టు టీచర్ల కొరత తీర్చాలి



తొలుత సబ్జెక్టు టీచర్ల కొరత తీర్చేందుకు పదోన్నతులు ఇవ్వాలి. ప్రాథమిక పాఠశాలలో ఒకటి నుంచి 5 తరగతులు ఉండేటట్లుగా మార్పుచేయాలి. ఉన్నత పాఠశాలల్లో ఆంగ్ల మాధ్యమంతో పాటు తెలుగు మాధ్యమాన్ని ప్రవేశపెట్టాలి. అప్పుడు డీఎస్సీకి ఎటువంటి సమస్య ఉండదు. అప్పటి వరకు ప్రాథమిక పాఠశాలల్లో అర్హత ఉన్న విద్యా వలంటీర్ సేవలను వినియోగించుకునే అవకాశం ఉంటుంది. ఈ సమస్యలను పరిష్కరించకుండా చేపట్టే సర్దుబాటు ప్రక్రియను స్వాగతించలేం.

– కొమ్మోజు శ్రీనివాసరావు, యూటీఎఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు

పదోన్నతుల అనంతరమే పని సర్దుబాటు జరగాలి



జీఓ నంబర్ 53 ప్రకారం పదోన్నతులు ఇచ్చి అనంతరం మాత్రమే మిగులు ఉపాధ్యాయులను సర్దుబాటు చేయాలి. ప్రతి ప్రాథమిక పాఠశాలలో 1 నుంచి 5 తరగతులు ఉండాలి. ఫ్యాప్టో ప్రభుత్వం ముందు ఉంచిన 17 డిమాండ్లను పరిష్కరించిన తరువాత మాత్రమే పని సర్దుబాటును అంగీకరిస్తాం. లేకుంటే ఉపాధ్యాయుల పోరుబాట తప్పదు.

– పీవీ సుబ్బారావు, ఐఫియా రాష్ట్ర కౌన్సిలర్

పదోన్నతులు ఇవ్వకుండా సర్దుబాటు ఏంటి..?

ఒక వైపు సబ్జెక్టు టీచర్లు కొరతగా ఉన్నారు. ప్రాథమిక పాఠశాలల్లో ఉపాధ్యాయులు మిగులుగా ఉన్నారు. ఇప్పుడు స్కూల్ అసిస్టెంట్ పోస్టులు అవసరం. ముందుగా పదోన్నతులు ఇస్తే ప్రాథమిక పాఠశాలల నుంచి స్కూల్ అసిస్టెంట్లుగా చాలామంది వెళతారు. తద్వారా సబ్జెక్టు టీచర్ల కొరత దాదాపు తీరుతుంది. ప్రాథమిక పాఠశాలలో ఒకటి నుంచి 5 తరగతుల వరకు బోధన ప్రారంభించడంతో పాటు తెలుగు మాధ్యమాన్ని కూడా సమాంతరంగా ప్రవేశపెడితే అవసరమైన ఉపాధ్యాయులను అర్హత ఉన్న విద్యావలంటీర్లతో భర్తీచేసే అవకాశం ఉంటుంది. ఈ ప్రక్రియ కూడా చేపట్టకుండా ఉపాధ్యాయులను శాశ్వత విధానంలో సర్దుబాటు చేయాలని నిర్ణయించడంపై ఉపాధ్యాయులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. లిక్కర్ పాలసీని, ఇసుక పాలసీని తీసుకురావడంలో ఉన్న శ్రద్ధ, వలంటీర్ల వ్యవస్థను రద్దు చేయడంలో ఉన్న శ్రద్ధ విద్యాబోధనపై ఎందుకు చూపడం లేదని ఉపాధ్యాయ సంఘాలు ప్రశ్నిస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే బుధవారం విజయవాడలో పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ ఉపాధ్యాయ సంఘాలతో నిర్వహించే సమావేశం కీలకం కానుంది.

న్యూస్‌రీల్

ఆటాడితే వేటాడతాం!

- పేకాటరాయుళ్లు, నిర్వాహకులపై పీడీ యాక్టు ప్రయోగిస్తాం
- పోలీసులు సహకరించినట్లు తేలితే నేరుగా ఇంటికే..
- పేకాట శిబిరాలపై 'సాక్షి' కథనానికి స్పందించిన ఎస్పీ ఏఆర్ దామోదర్



ఒంగోలు టౌన్: జిల్లాలో పేకాట శిబిరాలు నిర్వహిస్తే సహించేది లేదని, అవసరమైతే ఆటగాళ్లు, నిర్వాహకులపై పీడీ యాక్టు ప్రయోగిస్తామని ఎస్పీ ఏఆర్ దామోదర్ హెచ్చరించారు. జిల్లాలో విచ్చలవిడిగా పేకాట శిబిరాలు నిర్వహిస్తున్న వైనంపై 'కొయ్ కొయ్ పేక.. వెయ్ వెయ్ ముక్క' శీర్షికన 'సాక్షి'లో ప్రచురించిన కథనంపై ఎస్పీ స్పందించారు. జిల్లాలో ఎక్కడా పేకాట శిబిరాలు పెట్టేందుకు వీల్లేదని, నిర్వాహకులను బైండోవర్ చేయాలనిని ఇప్పటికే పోలీసు అధికారులను ఆదేశించామన్నారు. కొన్ని ప్రాంతాల్లో నిర్వాహకుల నుంచి నెలవారీ మామూళ్లు వసూలు చేస్తూ పోలీసులే పేకాటను ప్రోత్సాహిస్తున్నారన్న విషయంపై ఎస్పీ స్పందిస్తూ.. 'పోలీసుల పాత్ర ఉందని తేలితే తాట తీస్తాం, అలాంటి అక్రమార్కులను నేరుగా ఇంటికి పంపిస్తాం' అని హెచ్చరించారు. పేకాట శిబిరాలపై విచారణ జరుపుతున్నామని, నిందితులపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. నేరాలు, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే ఎంతటి వారైనా వదిలిపెట్టేది లేదన్నారు.

సాక్షి ఎఫెక్ట్..

మాదక ద్రవ్యాలపై ఉక్కుపాదం

- వినియోగం, రవాణాలపై నిఘా ఉంచాలి
- కలెక్టర్ తమీమ్ అన్సారియా



సమావేశం నిర్వహిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా, పక్కన ఎస్పీ దామోదర్

ఒంగోలు అర్బన్: మాదక ద్రవ్యాలు, మత్తు పదార్థాలపై ఉక్కుపాదం మోపాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. మంగళవారం ప్రకాశం భవనంలో ఎస్పీ దామోదర్‌తో కలిసి మాదకద్రవ్యాల నిరోధక కమిటీ సమావేశం నిర్వహించారు. దీనిలో కలెక్టర్ మాట్లాడుతూ మాదక ద్రవ్యాల రవాణా, వినియోగంపై పక్కాగా నిఘా ఉంచాలన్నారు. జిల్లాలో గంజాయి సాగు జరగకుండా చూడాలన్నారు. పాఠశాలలు, కళాశాలల్లో మాదకద్రవ్యాల వినియోగం వల్ల జరిగే నష్టాలపై అవగాహన కల్పించాలని ఆదేశించారు. చెక్ పోస్టుల వద్ద సరిహద్దు ప్రాంతాల్లో మత్తు పదార్థాల రవాణా జరగకుండా పటిష్టమైన తనిఖీలు నిర్వహించాలన్నారు. గిద్దలూరు, వైపాలెం తదితర మారుమూల ప్రాంతాల్లో అప్రమత్తంగా ఉండాలన్నారు. అమ్మకాలు మెడికల్ షాపుల్లో మత్తు సంబంధిత మందుల విక్రయాలు జరగకుండా డ్రగ్ కంట్రోల్ అధికారులు నిఘా ఉంచాలన్నారు. ప్రిస్కిప్షన్ లేకుండా అటువంటి మెడిసిన్స్ అమ్మకుండా చూడాలన్నారు. ఎస్పీ దామోదర్ మాట్లాడుతూ జిల్లాలో ఎక్కడా డ్రగ్స్, గంజాయి వంటివి రవాణా, వినియోగం జరగకుండా పటిష్టమైన చర్యలు తీసుకున్నామన్నారు. స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ద్వారా తనిఖీలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. గత నెలలో 4 అక్రమ గంజాయి రవాణా కేసులు నమోదు చేసి 19 మందిని అరెస్టు చేసి 43.4 కేజీల గంజాయిని సీజ్ చేసినట్లు తెలిపారు. సమావేశంలో అడిషనల్ ఎస్పీ నాగేశ్వరరావు, డీఆర్‌ఓ విశ్వేశ్వరరావు, డీటీసీ సుశీల, ఆర్డీవో సుబ్బారెడ్డి, డీఎంహెచ్‌ఓ సురేష్, వ్యవసాయ శాఖ జేడీ శ్రీనివాస్, మైనింగ్ డీడీ జగన్నాథరావు, సాంఘిక సంక్షేమ శాఖ డీడీ లక్ష్మానాయక్, డ్రగ్‌కంట్రోల్ అధికారి జ్యోతి ఇతర అధికారులు పాల్గొన్నారు.

మురిసిన తిరంగా

- మార్కాపురంలో 100 మీటర్ల జాతీయ జెండాతో భారీ ర్యాలీ



జాతీయ జెండాతో విద్యార్థుల ర్యాలీ

మార్కాపురం: స్వాతంత్ర్య దినోత్సవంలో భాగంగా మంగళవారం ఏబీవీపీ ఆధ్వర్యంలో విద్యార్థులు జాతీయ జెండాతో భారీ ర్యాలీ నిర్వహించారు. స్థానిక వివేకానంద విద్యాపీఠం నుంచి 100 మీటర్ల జాతీయ జెండాతో విద్యార్థులు భారీ తిరంగ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ ప్రారంభించిన ఆర్‌ఎస్‌ఎస్ నెల్లూర్ విభాగ ప్రచార కార్యక్ నవీన్, ప్రిన్సిపల్ మల్లిఖార్జున్‌లు మాట్లాడుతూ విద్యార్థుల్లో దేశభక్తి, జాతీయ సమైక్యత ఉండాలని అన్నారు. వందేమాతరం, భారత్‌మాతాకీ జై నినాదాలతో సాగిన ఈ ర్యాలీ పాతబస్టాండు, మెయిన్‌బజారు, నాయుడువీధి, తేరుబజారు గుండా సాగింది. జిల్లా ఆర్‌ఎస్‌ఎస్ సంపర్క ప్రముఖ్ కాశంరాజు రామకృష్ణ, పాఠశాల సెక్రటరీ డీ చంద్రశేఖర్, ఆర్‌ఎస్‌ఎస్ నగర్ కార్యవాహ అంజిరెడ్డి, ఏబీవీపీ నాయకులు పవన్‌కుమార్, శశేంద్ర, నారాయణ, వెంకటేశ్వర్లు, భానుతేజ, జనార్దన్, అశ్వర్థామ, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

న్యాయం జరిగే వరకు పోరాటం

- కోల్‌కత్తా వైద్యురాలి హత్యాచారంపై జూడాల ధర్నా
- సెంట్రల్ ప్రొటెక్షన్ యాక్ట్ అమలు చేయాలని డిమాండ్



కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న ప్రభుత్వ వైద్య కళాశాల విద్యార్థులు, పీజీలు, హౌస్ సర్జన్లు

ఒంగోలు టౌన్: కోల్‌కత్తాలోని ఆర్‌కేజీకేఏఆర్ కాలేజీలో పీజీ రెసిడెంట్ పై జరిగిన రేప్ అండ్ మర్డర్ దారుణమైన సంఘటన అని, ఈ ఘటనలో బాధితులకు న్యాయం జరిగేంత వరకు పోరాటం కొనసాగిస్తామని ఏపీ జూడా ఒంగోలు శాఖ ప్రసిడెంట్ డా.అజయ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. కోల్‌కతా మహిళా వైద్యురాలిపై జరిగిన హత్యాచారాన్ని నిరసిస్తూ మంగళవారం జూడా వైద్యులు ప్రభుత్వ కళాశాల ఆవరణలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాణాలను కాపాడే వైద్యులకే రక్షణ లేకపోతే ఎలా అని ప్రశ్నించారు. దేశంలోని అనేక ప్రాంతాల్లో ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని, ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం సెంట్రల్ ప్రొటెక్షన్ యాక్ట్ చట్టాన్ని అమలు చేయాలని కోరారు. స్వేచ్ఛాయుత వాతావరణం లేకుండా పనిచేయలేని పరిస్థితి నెలకొందని ఏపీ జూడా వైస్ ప్రసిడెంట్ బి.శృతి తెలిపారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వాల మీద ఉందన్నారు. కోల్‌కత్తా వైద్యురాలిపై జరిగిన హత్యాచారం సభ్య సమాజం తలదించుకునేలా ఉందని పీజీ డాక్టర్స్ ఏపీ అధికార ప్రతినిధి డా.సైనాల వెంకట సుబ్బారావు ఆవేదన వ్యక్తం చేశారు. పీజీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న రెసిడెంట్‌ను రాత్రి విధుల్లో వున్నప్పుడు దారుణంగా రేప్ చేశారని, అనంతం నిందితుడు ఆమెను అత్యంత క్రూరంగా హత్య చేశాడని చెప్పారు. కార్యక్రమంలో పీజీ వైద్యులు, హౌస్ సర్జన్లు, అండర్ గ్రాడ్యుయేట్లు, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

భారీ కొవ్వొత్తుల ప్రదర్శన:

కోల్‌కత్తా ప్రభుత్వ మెడికల్ కాలేజీలో హత్యాచారానికి గురైన పీజీ రెసిడెంట్ కు నివాళులర్పిస్తూ ప్రభుత్వ వైద్య కళాశాల విద్యార్థినీ విద్యార్థులు భారీ కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. సాయంత్రం 6.30 గంటలకు ప్రభుత్వ వైద్య కళాశాల ఆవరణకు చేరుకున్న విద్యార్థులు ర్యాలీలో పాల్గొన్నారు. ఏపీ జూడా ఆధ్వర్యంలో జరిగిన ఈ కొవ్వొత్తుల ర్యాలీలో మెడికోలు, పీజీ విద్యార్థులు, అండర్ గ్రాడ్యుయేట్లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

క్లుప్తంగా

పొగాకు గరిష్ట ధర రూ.359

ఒంగోలు సెంట్రల్: ఒంగోలు రీజియన్ పరిధిలో పొగాకు ధరలు నిలకడగా కొనసాగుతున్నాయి. మంగళవారం గరిష్టంగా కేజీ రూ.359 పలికిందని టుబాకో బోర్డు ఆర్ఎం లక్ష్మణరావు తెలిపారు. రీజియన్ పరిధిలోని 11 కేంద్రాలకు 11,241 బేళ్లు రాగా 9,011 బేళ్లు కొనుగోలయ్యాయి. వ్యాపారులు వివిధ కారనాలతో 2,230 బేళ్లు తిరస్కరించారు. ఒంగోలు(పేర్నమిట్ట), వెల్లంపల్లి, ఒంగోలు, కొండపి, టంగుటూరు కేంద్రాల్లో 130వ రోజు వేలానికి 5,779 బేళ్లు రాగా 4,763 కొనుగోలయ్యాయి. 1016 బేళ్లు తిస్కరణకు గురయ్యాయి. రైతులకు గరిష్ట ధర రూ.359, కనిష్ట ధర రూ.204, సరాసరి ధర రూ.307.19 దక్కింది. కందుకూరు-1, 2, కనిగిరి, డీసీపల్లి, కలిగిరి, పొదిలి తదితర కేంద్రాల్లో 124వ రోజు వేలానికి 5,462 బేళ్లు రాగా 4,248 కొనుగోలయ్యాయి. 1214 బేళ్లు తిరస్కరణకు గురయ్యాయి. రైతులకు గరిష్ట ధర రూ.358, కనిష్ట ధర రూ.204, సరాసరి ధర రూ.294.50 దక్కింది.

ఒంగోలులో అసిస్టెంట్ యోగా టీచర్ ట్రైనింగ్

ఒంగోలు టౌన్: హరిద్వార్ పతంజలి యోగపీఠం ఆధ్వర్యంలో జిల్లా కేంద్రమైన ఒంగోలులో యోగా టీచర్ ట్రైనింగ్ శిక్షణను ప్రారంభించనున్నట్లు పతంజలి యోగ రాష్ట్ర అధ్యక్షుడు బాల సుబ్రహ్మణ్యం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. యోగలో అనుభవం ఉండి సర్టిఫికెట్‌లేని వారు, బీఈడీ, బీపీఈడీ, టీటీసీ చేసిన వారు ఈ ట్రైనింగ్ కోసం తమ పేర్లను రిజిస్టర్ చేసుకోవాలని కోరారు. ఆగస్టు 15వ తేదీ నుంచి అడ్మిషన్లు మొదలవుతాయని, దేశ వ్యాప్తంగా పేరొందిన యోగా మాస్టర్లు, సైకాలజిస్టులు 120 గంటల పాటు శిక్షణ ఇవ్వనున్నట్లు వివరించారు. జిల్లాలోని అన్నీ ప్రాంతాలకు చెందిన ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు 9885125053, 7780680121 కు సంప్రదించాలని తెలిపారు.

విద్యా సంస్థల బస్సుల తనిఖీ

ఒంగోలు: జిల్లాలోని విద్యా సంస్థల బస్సులను రవాణాశాఖ అధికారులు మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. డ్రైవర్ల యూనిఫాం, చిన్న పిల్లల అటెండెంట్లు, ర్యాష్ డ్రైవింగ్, పరిమితికి మించి విద్యార్థులను ఎక్కించడం తదితర అంశాలను పరిశీలించినట్లు రవాణాశాఖ డిప్యూటీ కమిషనర్ ఆర్.సుశీల తెలిపారు. జిల్లా వ్యాప్తంగా నిబంధనలు అతిక్రమించిన 45 బస్సులపై కేసులు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

18న గ్రాప్లింగ్ క్రీడాకారుల ఎంపిక

టంగుటూరు: ప్రకాశం జిల్లా గ్రాప్లింగ్, రెజ్లింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 18న ఒంగోలు పీవీఆర్ బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో గ్రాప్లింగ్ క్రీడాకారుల ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ కార్యదర్శి పులిచర్ల సురేష్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పోటీల్లో ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 25, 26వ తేదీల్లో రేణిగుంట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రకాశం జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహిస్తారని పేర్కొన్నారు. బాలికల విభాగాన్ని పాఠశాల పీడీ జ్యోత్స్నాదేవి, బాలుర విభాగాన్ని వరికూటి జాషువా ఎంపిక చేస్తారని తెలిపారు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు ఆధారు కార్డు, జనన ధ్రువీకరణ పత్రం, నాలుగు ఫొటోలు తీసుకురావాలని సూచించారు.

ఉచిత వైద్యం.. పేదలకు దూరం



- సీఎం చంద్రబాబు లక్ష్యం అదే..
- వైఎస్సార్ సీపీ వైద్య విభాగం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ బత్తుల విమర్శ

సింగరాయకొండ: వైద్యాన్ని ప్రైవేటుపరం చేసి పేదలకు వైద్యాన్ని దూరం చేయడమే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు లక్ష్యమని, అందుకు ప్రస్తుతం జరుగుతున్న పరిణామాలే నిదర్శనమని వైఎస్సార్ సీపీ వైద్య విభాగం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ బత్తుల అశోక్‌కుమార్‌రెడ్డి విమర్శించారు. సింగరాయకొండలోని డాక్టర్ బత్తుల శివరామిరెడ్డి ఆస్పత్రి ప్రాంగణంలో మంగళవారం సాయంత్రం విలేకరుల సమావేశంలో పాల్గొన్నారు. డాక్టర్ బత్తుల మాట్లాడుతూ చంద్రబాబు మూడు సార్లు ముఖ్యమంత్రిగా చేసినప్పుడు వైద్య రంగాన్ని ప్రైవేటీకరణ చేశారని, ప్రస్తుతం కూడా అదే బాటలో నడుస్తున్నాడన్నారు. పేదలకు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైద్యాన్ని దగ్గర చేస్తే.. చంద్రబాబు ప్రైవేటీకరణ ద్వారా వైద్యాన్ని దూరం చేయడానికే ప్రయత్నిస్తున్నారన్నారు. రాష్ట్రంలో సుమారు 85 శాతం ప్రజలు పేద, మధ్య తరగతి కుటుంబాల వారేనన్నారు. జగన్ మోహన్‌రెడ్డి తన పాలనలో ఆరోగ్య శ్రీ పథకం కింద గతంలో 1,059 రోగాలకు చికిత్స చేస్తే ఆ సంఖ్యను 3,257 రోగాలకు పెంచారని గుర్తు చేశారు. రాష్ట్రంలో గతంలో 11 ప్రభుత్వ మెడికల్ కాలేజీలు, ఒక ఎయిమ్స్ ఆస్పత్రి, 19 ప్రైవేటు మెడికల్ కాలేజీలు ఉన్నాయన్నారు. జగన్‌మోహన్ రెడ్డి పేదలకు డాక్టర్ కావాలనే కోరిక తీర్చేందుకు కేంద్ర ప్రభుత్వ సహకారంతో 17 మెడికల్ కాలేజీల నిర్మాణానికి శ్రీకారం చుట్టారని చెప్పారు. గత సంవత్సరం 5 మెడికల్ కాలేజీలు విజయవాడ, మచిలీపట్నం, రాజమండ్రి, ఏలూరు, నంద్యాలలో ప్రారంభించారని, ఈ సంవత్సరం మార్కాపురం, పాడేరు, పులివెందుల, ఆదోని, మదనపల్లె మెడికల్ కాలేజీలు ప్రారంభం కావాల్సి ఉండగా టీడీపీ కూటమి ప్రభుత్వం వాటి గురించి పట్టించుకోవటం లేదని ఆక్షేపించారు. మరో 7 మెడికల్ కాలేజీలు నిర్మాణదశలో ఉన్నాయన్నారు. ఈ కాలేజీల నిర్మాణానికి కేంద్రం 60 శాతం నిధులు ఇస్తుండగా మిగిలిన 40 శాతం నిధులు రాష్ట్రం భరించాల్సి ఉందని ఆ ప్రకారం కేవలం రూ.3,820 కోట్లు ఖర్చు చేస్తే కాలేజీలు ప్రారంభమై పేద మెడికల్ విద్యార్థులు చదువుకోవటానికి అవకాశం కలుగుతుందని వివరించారు. జగన్ ప్రభుత్వంలో 108, 104 వాహనాలు కొత్తవి 1,969 ఏర్పాటు చేశారని, 175 పశువైద్యానికి మొబైల్ అంబులెన్స్‌లు ఏర్పాటు చేశారన్నారు. ప్రతి మండలంలో రెండు పీహెచ్‌సీలు ఉండేలా చర్యలు చేపట్టారన్నారు. ఇందుకు సిబ్బందిని కూడా నియమించారని, ఆస్పత్రి భవనాలు నిర్మించాల్సి ఉందన్నారు. 2019-24 మధ్యకాలంలో 53,466 మంది వైద్య సిబ్బందిని నియమించారని వివరించారు. జగనన్న సురక్ష పథకం ద్వారా రాష్ట్రంలో రికార్డు స్థాయిలో 15 వేల మెడికల్ క్యాంపులు నిర్వహించారని, వైఎస్సార్ కంటివెలుగు కార్యక్రమం ద్వారా 1.13 కోట్ల మందికి కంటి ఆపరేషన్లు ఉచితంగా చేశారన్నారు. కరోనాలో ప్రభుత్వ ఆస్పత్రిలో ఏవిధంగా ప్రజలకు సేవలు అందాయో అందరికీ తెలుసన్నారు. ఈ విధంగా వైద్య రంగం బలోపేతానికి జగనన్న కృషి చేస్తే వైఎస్సార్‌సీపీ పాలనలో వైద్య రంగం అతలాకుతలమైందని ఆరోపించడం బాధాకరమన్నారు. మంచి కార్యక్రమాలను కొనసాగించాలే తప్ప వాటిని నాశనం చేయకూడదని హితవు పలికారు. వైద్య రంగాన్ని ప్రైవేటీకరణ చేసే కార్యక్రమాన్ని నిలుపుదల చేసి పేదలకు వైద్యాన్ని దగ్గర చేసేందుకు కృషి చేయాలని డాక్టర్ బత్తుల ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

నాటుసారా తయారీదారులపై పీడీయాక్టు

- ఎస్పీ దామోదర్

ఒంగోలు టౌన్: జిలాల్లో నాటుసారా తయారీ, రవాణాను పూర్తిస్థాయిలో అరికట్టేందుకు క్షేత్రస్థాయిలో కఠిన చర్యలు తీసుకోవాలని, అవసరమైతే పీడీ యాక్టు అమలుకు ప్రతిపాదనలు పంపించాలని ఎస్పీ ఏఆర్ దామోదర్ సూచించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో మంగళవారం సెబ్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. సెబ్ పోలీస్ స్టేషన్లవారీగా పెండింగ్ కేసులు, ఆయా కేసుల పురోగతి, నిందితుల అరెస్టు తదితర వివరాలపై ఆరా తీశారు. పెండింగ్ కేసులను త్వరితగతిన పూర్తి చేయాలని, దర్యాప్తు పూర్తయిన కేసుల్లో కోర్టులో చార్జిషీటు వేయాలని ఆదేశించారు. నాటుసారా విక్రయ కేంద్రాలను గుర్తించి దాడులు నిర్వహించాలన్నారు. ఇతరా రాష్ట్రాల నుంచి ఎన్డీపీఎల్ లిక్కర్ అక్రమంగా జిల్లాలోకి ప్రవేశించకుండా గట్టి నిఘా పెంచాలని సూచించారు. జిల్లా సరిహద్దుల చెక్‌పోస్టుల వద్ద నిత్యం వాహనాలను తనిఖీ చేయాలని, అక్రమ మద్యం రవాణాకు అడ్డుకోవాలని చెప్పారు. బెల్ట్‌షాపులపై ఆకస్మికంగా దాడులు నిర్వహించి కేసులు నమోదు చేయాలని చెప్పారు. గంజాయి సరఫరా ఎక్కడ నుంచి జరుగుతుందో, ఎవరు వినియోగిస్తున్నారో తెలుసుకొని నెట్‌వర్క్‌ను ఛేదించాలని , గంజాయితో సంబంధం ఉన్న వారందరిపై కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. మాదక ద్రవ్యాల వల్ల కలిగే నష్టకష్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని చెప్పారు. జిల్లాలో ఎక్కడా గంజాయి అవశేషాలు, ఆనవాళ్లు కనిపించకూడదని స్పష్టం చేశారు. గంజాయి తదితర మాదక ద్రవ్యాలు, ఇతరా రాష్ట్రాల నుంచి తరలించే అక్రమ మద్యం, పేకాట స్థావరాలపై పక్కా ప్రణాళిక ప్రకారం దాడులు చేయాలని ఆదేశించారు. సమావేశంలో ఏఎస్పీ (అడ్మిన్) కె. నాగేశ్వరరావు, ఒంగోలు సెబ్ ఈఎస్ రవికుమార్, మార్కాపురం ఏఈఎస్ దుర్గా ప్రసాద్ పాల్గొన్నారు.



సెబ్ సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ ఏఆర్ దామోదర్

దేవుడా.. బతికిపోయాం!

- తిరుమల నుంచి వస్తూ ప్రమాదానికి గురైన కారు, టెంపో
- సింగరాయకొండ సమీపంలో విమానాల రన్‌వేపై వరుస ఘటనలు
- ఇద్దరికి తీవ్ర, ఏడుగురికి స్వల్పంగా గాయాలు
- సకాలంలో స్పందించిన హైవే, స్థానిక పోలీసులు
- సంఘటనా స్థలాన్ని పరిశీలించిన ఎస్పీ ఏఆర్ దామోదర్



డివైడర్‌ను ఢీకొట్టడంతో దెబ్బతిన్న కారు



బోల్తాపడిన టెంపో



సంఘటనా స్థలంలో ఎస్పీ దామోదర్

సింగరాయకొండ: తిరుమల వెంకటేశ్వరస్వామిని దర్శించుకుని కారులో తిరుగు ప్రయాణమైన ఓ కుటుంబం, వెంకన్న సన్నిధిలోనే వివాహం చేసుకుని టెంపోలో వస్తున్న ఓ బృందం మార్గమధ్యంలో ప్రమాదానికి గురై తృటిలో ప్రాణాపాయం నుంచి బయటపడ్డారు. సింగరాయకొండ మండలం మూలగుంటపాడు పంచాయతీ పరిధిలోని విమానాల రన్‌వేపై వెంకటేశ్వర ఫంక్షన్ హాల్ సమీపంలో మంగళవారం తెల్లవారుజామున సుమారు 2.30 గంటల సమయంలో రెండు వరుస ప్రమాదాలు సంభవించాయి. కారులో ఐదుగురు, టెంపోలో 12 మంది ప్రయాణిస్తుండగా.. వారిలో ఇద్దరికి తీవ్రంగా, మిగిలిన వారికి స్వల్ప గాయాలయ్యాయి. పోలీసుల కథనం ప్రకారం.. పశ్చిమ గోదావరి జిల్లా నరసాపురానికి చెందిన పులివర్తి కుమార్‌రాజా, పి.నరస్వతి, పి.భువనసత్యసాయి, పడవల మంగతాయారమ్మ, పడవల హనుమంతరావు తిరుమలలో స్వామివారిని దర్శించుకుని కారులో తిరుగు ప్రయాణమయ్యారు. విమానాల రన్‌వే పైకి రాగానే రోడ్డు మధ్యలో ఉన్న డివైడర్ దిమ్మెను కారు బలంగా ఢీకొట్టింది. కారు ముందు భాగం దెబ్బతినడంతోపాటు డివైడర్ దిమ్మె రోడ్డు మధ్యలో నిలిచింది. సమీపంలోనే ఉన్న స్థానిక పోలీసులు, హైవే పెట్రోలింగ్ సిబ్బంది కారు వద్దకు చేరుకుని క్షతగాత్రులను బయటకు దించారు. డివైడర్ దిమ్మెను పక్కకు తొలగించే ప్రయత్నం చేస్తున్నారు. అదే సమయంలో టెంపో వాహనం వేగంగా వచ్చి డివైడర్ దిమ్మెను ఢీకొట్టి బోల్తా పడింది. పోలీసులు అప్రమత్తంగా ఉండటంతో సురక్షితంగా బయటపడ్డారు. టెంపోలో ప్రయాణిస్తున్నది కొండపి మండలం పెరిదేపి గ్రామానికి చెందిన వారు కాగా, తిరుమలలో వివాహం చేసుకుని తిరుగు ప్రయాణంలో ఉన్నారు. ఈ ఘటనలో వరుడు పుట్టా కృష్ణ చైతన్య, వధువు అసోం రాష్ట్రానికి చెందిన దీప్, శోభారాణి, పి.బాపయ్య, ఆర్.శ్రీకాంత్, లక్ష్మీప్రియ, మహేంద్ర, వెంకారెడ్డికి స్వల్ప గాయాలయ్యాయి. వీరిని 108, హైవే అంబులెన్స్‌లో ఒంగోలు జీజీహెచ్‌కు తరలించారు. తీవ్ర గాయాలపాలైన బ్రహ్మయ్య, మహేంద్రను స్థానిక ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఎస్పీ ఏఆర్ దామోదర్ సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. సకాలంలో స్పందించిన సీఐ సిహెచ్ హజరత్తయ్య, ఎస్సై టి.శ్రీరామ్, ఏఎస్సై షేక్ మహబూబ్ బేగ్, సిబ్బందిని అభినందించారు.

బాధ్యులపై కేసులు

వరుస ప్రమాదాలు సంభవించడానికి జాతీయ రహదారి అధికారులు, కాంట్రాక్టర్ నిర్లక్ష్యమే కారణమని ప్రాథమిక నిర్ధారణకు వచ్చిన ఎస్పీ.. బాధ్యులపై కేసులు నమోదు చేయాలని స్థానిక పోలీసులను ఆదేశించారు. కలెక్టర్, హైవే అధికారులతో చర్చించి రన్‌వేపై ప్రత్యేక భద్రతా చర్యలు చేపడతామని వివరించారు.

అదుపుతప్పి స్కూల్‌వ్యాన్ బోల్తా



పొలంలోకి ఒరిగిపోయి బోల్తాపడిన స్కూల్ వ్యాన్

పామూరు: ఎదురుగా వస్తున్న పశువులు, ఆటోను తప్పించే క్రమంలో రోడ్డు మార్జిన్ దిగిన స్కూల్ వ్యాన్ అదుపు తప్పి బోల్తా పడింది. ఈ సంఘటన మండలంలోని తూర్పు కట్టకిందపల్లె సమీపంలో జరిగింది. వివరాల్లోకి వెళితే.. పామూరులోని ప్రైవేట్ పాఠశాలకు చెందిన స్కూల్ వ్యాన్ మండలంలోని బొట్లగూడూరులో విద్యార్థులను ఎక్కించుకొని మధ్యలో తూర్పుకట్టకిందపల్లె వెళుతుంది. ఈ క్రమంలో వ్యాన్‌కు పశువులు, ఆటో ఒక్కసారిగా ఎదురురావడంతో డ్రైవర్ వాటిని తప్పించేందుకు రోడ్డు మార్జిన్ దించాడు. అయితే రాత్రి కురిసిన వర్షానికి టైర్లు జారి బురదలో ఇరుక్కొని రోడ్డు పక్క పొలాల్లో ఒరిగింది. వ్యాన్ డ్రైవర్ అప్రమత్తమై అద్దాల పగులగొట్టి విద్యార్థులను కిందకు దించాడు. విద్యార్థులను దించిన వెంటనే వ్యాన్ పూర్తిగా బురదలోకి ఒరిగి బోల్తా పడింది. విషయాన్ని పాఠశాల యాజమాన్యం దృష్టికి తేగా వేరే వ్యాన్‌లో విద్యార్థులను పాఠశాలకు తరలించి వెంటనే వ్యాన్‌ను ప్రొక్లెయిన్ సాయంతో బయటకు తీసి పాఠశాలకు తీసుకువచ్చారు. పాఠశాలను సందర్శించిన తహసీల్దార్ బీవీ రమణారావు, ఎంఈఓ కరుణకుమారి, ఎస్సై ఎం సైదుబాబు ఘటనపై విచారణ జరిపారు. విద్యార్థులకు ఎలాంటి ప్రమాదం జరగలేదని అందరూ బాగానే ఉన్నారని తహసీల్దార్ తెలిపారు.

పంద్రాగష్టు వేడుకలు పండుగలా నిర్వహించాలి

- కలెక్టర్ తమీమ్ అన్సారియా



పోలీసు పరేడ్ గ్రౌండ్‌ను పరిశీస్తున్న కలెక్టర్, ఎస్పీ

ఒంగోలు టౌన్: స్వాతంత్ర దినోత్సవాన్ని పండుగ వాతావరణాన్ని తలపించేలా నిర్వహించాలని కలెక్టర్ ఏ. తమీమ్ అన్సారియా జిల్లా అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలోని పోలీసు పరేడ్‌లో జరుగుతున్న వేడుకల ఏర్పాట్లను ఎస్పీ ఏఆర్ దామోదర్‌తో కలిసి మంగళవారం సాయంత్రం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కార్యక్రమ నిర్వాహణలో ఎలాంటి లోపం లేకుండా చూసుకోవాలని, కచ్చితంగా ప్రోటోకాల్‌ను పాటించేలా తగిన చర్యలు తీసుకోవాలని చెప్పారు. పోలీసు కవాతు, శకటాల ప్రదర్శన, సాంస్కృతిక కార్యక్రమాల నిర్వాహణలో సమయపాలన తప్పనిసరన్నారు. ఆయా ప్రభుత్వ శాఖల పనితీరు , ప్రజలకు అందిస్తున్న సేవలను తెలియజేసేలా స్టాల్స్ ఏర్పాటు చేయాలన్నారు. వేడుకలను వీక్షించేందుకు వచ్చే వారి హోదాను, సంఖ్యను దృష్టిలో వుంచుకొని ఎలాంటి లోటుపాట్లు జరగకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. ఎస్పీ ఏఆర్ దామోదర్ మాట్లాడుతూ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. పట్టణ ప్రముఖులు, వివిధ విద్యాసంస్థలకు చెందిన విద్యార్థులు వస్తున్నందున వాహనాల పార్కింగ్‌పై పోలీసు అధికారులు ప్రధానంగా దృష్టి సారించాలని సూచించారు. జాయింట్ కలెక్టర్ గోపాల కృష్ణ, ఏఎస్పీ (అడ్మిన్) కె. నాగేశ్వరరావు, ఏఆర్ అడిషనల్ ఎస్పీ అశోకబాబు, డీఆర్‌ఓ విశ్వేశ్వరరావు, ఆర్డీఓ జీవీ సుబ్బారెడ్డి ఉన్నారు.

ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణా అరికట్టాలి

- కలెక్టర్ తమీమ్ అన్సారియా



సమావేశం నిర్వహిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు అర్బన్: జిల్లాలో ఇసుక, మట్టి అక్రమ తవ్వకాలు, రవాణాను పక్కాగా అరికట్టాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా స్పష్టం చేశారు. ప్రకాశం భవనంలో ఇసుక జిల్లా స్థాయి కమిటీ సమావేశం మంగళవారం నిర్వహించారు. దీనిలో కలెక్టర్ మాట్లాడుతూ ఇసుక, మట్టి అక్రమాలను అరికట్టేలా అవసరమైన చర్యలు తీసుకుని నిరంతర పర్యవేక్షణ ఉంచాలన్నారు. క్షేత్ర స్థాయిలో ఇసుక రీచ్‌లను సంబంధిత అధికారులు పరిశీలించాలని ఆదేశించారు. ప్రభుత్వం గుర్తించిన ఇసుక రీచ్‌ల వద్ద అసవరం మేరకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. డివిజన్ స్థాయి టాస్క్‌ఫోర్స్ కమిటీలు, మండల కమిటీలను ఏర్పాటు చేయాలన్నారు.

ఎస్పీ దామోదర్ మాట్లాడుతూ ఇసుక అక్రమ రవాణాకు ఎటువంటి అవకాశం లేకుండా ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పక్కా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో మార్కాపురం సబ్ కలెక్టర్ రాహుల్ మీనా, అడిషనల్ ఎస్పీ నాగేశ్వరరావు, ఒంగోలు ఆర్డీవో సుబ్బారెడ్డి, మైనింగ్ డీడీ జగన్నాథరావు, డీపీవో ఉషారాణి, డీటీసీ సుశీల, హౌసింగ్ పీడీ పేరయ్య, మార్కాపురం మైనింగ్ ఏడీ విష్ణువర్ధన్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఇష్టానుసారంగా పొగాకు సాగు చేయొద్దు

- పొగాకు బోర్డు ఈడీ అద్దంకి శ్రీధర్‌బాబు

పొదిలి: ప్రస్తుతం మార్కెట్ ధరలు దృష్టిలో ఉంచుకుని రైతులు ఇష్టానుసారం పొగాకు సాగు చేయవద్దని పొగాకు బోర్డు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అద్దంకి శ్రీధర్ బాబు సూచించారు. స్థానిక పొగాకు బోర్డులోని వేలం కేంద్రాన్ని మంగళవారం ఆయన సందర్శించారు. వేలం తీరును పరిశీలించారు. వేలంలో ఉంచిన పొగాకు నాణ్యతను, దానికి కంపెనీలు ఇస్తున్న ధరలను పరిశీలించి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. బోర్డు ఆవరణలోని పలు విభాగాలను ఆయన సందర్శించారు. నూతనంగా నిర్మించిన గోదాములను, ఆధునికీకరణ పనులు పరిశీలించారు. అనంతరం అధికారులు, రైతులతో సమీక్ష నిర్వహించారు. అధిక ధరలకు పొలం, బ్యారన్‌లు కౌలుకు తీసుకుని పొగాకు సాగు చేయవద్దని కోరారు. బోర్డు అనుమతించిన మేరకు మాత్రమే పొగాకు సాగు చేసి, నాణ్యమైన ఉత్పత్తులను పొందాలన్నారు. సేంద్రియ ఎరువులను వాడటం, అధికారుల సూచనలు పాటించటం చేయాలన్నారు. అనంతరం శ్రీధర్‌బాబును రైతు సంఘం నాయకులు సన్మానించారు. నాయకులు దండే వీరనారాయణ మాట్లాడుతూ గత రెండు సంవత్సరాలుగా రైతులకు అదనపు అమ్మకాలపై అపరాధ రుసుం లేకుండా కొనుగోలు చేయిస్తున్నందుకు రైతుల తరఫున కృతజ్ఞతలు తెలిపారు. సూర, ముక్క, పండుగుల్ల రకాల పొగాకు కొనుగోలుకు అనుమతులు ఇచ్చినందుకు కృతజ్ఞతలు చెప్పారు. కార్యక్రమంలో వేలం అధికారి జి.గిరిరాజ్ కుమార్, పొగాకు బోర్డు కార్యదర్శి దివి వేణుగోపాల్, ప్రొడక్షన్ మేనేజర్ మరియు ఆర్ఎం ఎం.కృష్ణశ్రీ, గుంటూరు ప్రధాన కార్యాలయం సూపరింటెండెంట్ కేవీ.రామాంజనేయులు, రైతు సంఘం నాయకులు బీరం కృష్ణారెడ్డి, ఆవులూరి కోటేశ్వరరావు, ఇంకొల్లు నరసారెడ్డి, రైతులు పాల్గొన్నారు.

అక్రమార్కులపై కఠిన చర్యలు

- డ్వామా పీడీ అర్జున్‌రావు
- ఉపాధి పనుల్లో రూ.2.17 కోట్ల రికవరీకి ఆదేశాలు



ప్రజావేదికలో రికార్డులు పరిశీలిస్తున్న పీడీ అర్జున్‌రావు

ముండ్లమూరు: గ్రామీణ ఉపాధి హామీ పనుల్లో అక్రమాలకు పాల్పడితే రికవరీతో పాటు క్రమశిక్షణా చర్యలు తప్పవని డ్వామా పీడీ బి అర్జున్‌రావు హెచ్చరించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. మండలంలోని 20 పంచాయతీల్లో వారం రోజులుగా ఆడిట్ డీఆర్పీలు క్షేత్ర స్థాయిలో చేపట్టిన పనులను పరిశీలించారు. ఇంటింటికీ తిరిగి మస్టర్లను పరిశీలించారు. చేపట్టిన పనులకు సంబంధించి సిబ్బంది సమక్షంలో కొలతలు చేపట్టారు. ఆడిట్ సిబ్బంది గ్రామాల్లో కూలీల మస్టర్లు, కొలతల్లో తేడాలు ఉన్నట్లు నిర్ధారించారు. మండలంలో 790 పనులను రూ.12.03 కోట్లతో చేపట్టారు. అయితే ప్రతి గ్రామంలో చేపట్టిన పనుల్లో తేడాలు ఉన్నట్లు గుర్తించి నిర్ధారించారు. మొత్తం రూ.2.62 కోట్ల మేర సిబ్బంది అక్రమాలకు పాల్పడ్డారని ఆడిట్ సిబ్బంది అధికారుల దృష్టికి తీసుకురాగా రూ.2.17 కోట్ల రికవరీకి ఆదేశించారు. ముండ్లమూరు పంచాయతీలో రూ.48 లక్షలు, పసుపుగల్లులో రూ.28 లక్షలు, వేములలో రూ.22 లక్షలు, మారెళ్లలో రూ.16 లక్షలు, కెల్లంపల్లిలో రూ.16 లక్షలు, నాయుడుపాలెంలో రూ.11 లక్షలు, నూజిళ్లపల్లిలో రూ.15 లక్షలు, ఈదరలలో రూ.11 లక్షలు, పులిపాడులో రూ.14 లక్షలు, పూరిమెట్లలో రూ.13 లక్షలు, మిగిలిన పంచాయతీల్లో రూ.2 నుంచి రూ.7 లక్షల వరకు అక్రమాలు జరిగినట్లు నిర్ధారించారు. మిగిలిన అన్నీ పంచాయతీల్లో పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, ఏపీఈడబ్ల్యూ ఐడీసీ శాఖల్లో కొద్ది మేర అక్రమాలు జరిగినట్లు తేల్చారు.

అనంతరం పీడీ మాట్లాడుతూ అక్రమాలకు పాల్పడితే ఎంతటి వారైనా రికవరీ చెల్లించాల్సిందేనన్నారు. గడువు లోగా రికవరీ నగదు చెల్లించాలని, లేకుంటే క్రమశిక్షణా చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లా విజిలెన్స్ ఆఫీసర్ పి.ఝాన్సీరాణి, డీఆర్‌డీఏ ఏపీడీ డాక్టర్ జీవీ వరప్రసాద్, ఎస్ఆర్‌పీ వెంకటేశ్వరరావు, ఎంపీడీఓ ఆర్ జనార్దన్, ఏపీఓలు కొండయ్య, కె.నాగరాజు, ఈసీ ప్రసాద్, డీఆర్పీలు, ఉపాధిహామీ పథకం సిబ్బంది పాల్గొన్నారు.

'మా గ్రామానికి తాగునీరివ్వండి'

- సాగర్‌కెనాల్ రాజంపల్లి మేజర్ వద్ద రైతుల నిరసన



వీరాయపాలెం మేజర్ వద్ద నిరసన తెలుపుతున్న రైతులు

దర్శి: మండలంలోని రామచంద్రాపురం గ్రామానికి తాగునీరు ఇవ్వాలని కోరుతూ సాగర్ కెనాల్ రాజంపల్లి మేజర్ వద్ద ఆ గ్రామ రైతులు నిరసనకు దిగారు. గ్రామంలో ఉన్న రెండు కుంటలు ఎండిపోవడంతో గేదెలకు తాగునీరు అందే పరిస్థితి లేక ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. సాగర్ కుడి కాలువ నుంచి రాజంపల్లి మేజర్‌కు నీరు వదిలితే మా గ్రామంతో పాటు మరికొన్ని గ్రామాలకు తాగునీరు అందుతుందని తెలిపారు. అయితే అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ మమ్మల్ని ఇబ్బంది పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయకట్టు ప్రాంతం కానీ కొండపి తదితర ప్రాంతాలకు దర్శి నుంచి వెళ్లే సాగర్ జలాలు పంపిణీ చేస్తున్నారని, ఆయకట్టు పరిధిలో ఉన్న మా గ్రామానికి మాత్రం తాగునీరు ఇవ్వకపోవడం దారుణంగా ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలోని బోర్లన్నీ అడుగంటడంతో గేదెలకు నీరు కావాలంటే పొలాల్లోకి వెళ్లి తెచ్చుకోవాల్సి వస్తోందని వాపోయారు. ప్రస్తుతం పొలం పనులు జరుగుతున్న సమయంలో గేదెల నీటి కోసం గంటల తరబడి సమయం కేటాయించాల్సి రావడంతో ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. గ్రామంలోని రెండు కుంటలను నింపితే కొంత సమస్య తీరుతుందంటున్నారు.

డీఎస్సీ ఉచిత కోచింగ్‌కు గడువు పెంపు

ఒంగోలు సెంట్రల్: జిల్లాలోని గిరిజనులకు డీఎస్సీ ఉచిత కోచింగ్ ఇవ్వటానికి దరఖాస్తుల స్వీకరణకు గడువు పొడిగించినట్లు గిరిజన సంక్షేమ శాఖ జిల్లా సంక్షేమాధికారి జగన్నాథరావు వెల్లడించారు. జిల్లాలోని గిరిజనులు డిగ్రీ, బీఈడీ, ఇంటర్, డీఈడీ, టెట్ పాసైన వారిని మెరిట్ ఆధారంగా డీఎస్సీ కోచింగ్‌కు అర్హులుగా ఎంపిక చేయనున్నట్లు చెప్పారు. జిల్లాలోని నిరుద్యోగ గిరిజన యువతీ యువకులు ఆసక్తి కల వారు దరఖాస్తుతో పాటు పదో తరగతి, ఇంటర్మీడియెట్, డిగ్రీ, బీఈడీ, ఇంటర్, డీఈడీ, టెట్ పాసైన ఉత్తీర్ణత సర్టిఫికెట్స్, కుల ధ్రువీకరణ పత్రం, ఆధార్, రేషన్ జెరాక్స్ కాపీలు, పాస్‌పోర్ట్ సైజు ఫొటోలతో మీ దరఖాస్తును సమర్పించాలని కోరారు. వంద మంది వరకు కోచింగ్ ఇవ్వటానికి ఎంపిక చేయనున్నట్లు చెప్పారు. అర్హత గల అభ్యర్థులు త్వరిత గతిన దరఖాస్తు చేసుకోవాలని కోరారు.